# పక్షి ఉత్తరం

## –గుడిపాటి వెంకటచలం

ఇంక మీ మొహాన్ని యీ జన్మానికి చూడననుకుంటే; మీరు మనస ల్లాపాలూ, ప్రేమా, అన్నీ మరిచిపోతారనుకుంటే, కొద్దిరోజుల్లో మళ్లీ పెళ్లి చేసుకుని, నన్ను పిలిచిన ముద్దు పేర్లన్నిటితోనూ ఇంకెవర్నో పిలిచి, నా బుగ్గ మీద వెళ్ళేసేట్టే అట్లానే దాని బుగ్గ మీద వేసి లాలిస్తారనుకుంటే; యెంతో బాధ కలుగుతుంది. వారం రోజుల నుంచి ఆలోచించుకుని ఆలోచించుకుని యీ బాధంతా రాత్రింబవళ్ళు మనసులో అనుభవించి ఆలోచించి చివరికి తప్పనిసరిగా మీకురాస్తున్నాను.

నేను యీ రాత్రి చచ్చిపోవడానికి నిశ్చయించుకున్నాను. మీ కోసం, నా కోసం, అందరి క్షేమం కోసం ఆలోచించే నిశ్చయించుకున్నాను. నా కోసం అట్టే దుఃఖించకండి. ఈ వుత్తరమంతా చదివినప్పుడు, నా చావు మీకు కొంత శాంతిని కూడా కలిగిస్తుందేమో! కాని జాలన్నా పడరూ? పడతారు. మీ హృదయం నాకు తెలుసు. నాకు తెలీకపోతే యింకెవరికి తెలుస్తుంది? నా ప్రేమని మాత్రం నిశ్చలమైన నా ప్రేమని మాత్రం సందేహించకండి. అది నేను సహించలేను సందేహించలేదని మీరు వుత్తరం రాసి, నన్ను ఆవుతారని భయం. మీ ధర్మం అనుకుని అవుతారు. కాని జాలిపడి క్షమించానంటారు గాని మీరు భరించలేరని నాకు తెలుసు. మీ హృదయం నాకు తెలీదూ! తరువాత మనిద్దరి జీవితం దుర్భరమౌతుంది. నాకే మీమీద అంత ప్రేమలేకపోతే, మీకే నా మీద అంత కాంక్షలేకపోతే లోకంలో అందరి మల్లే వుంటే మనమున్నూ – యెట్లాగో కాపరం చేసే వాళ్ళమే ... యీ పని జరిగింతరువాత కూడా ... కాని అంత గాఢమైన నిర్మలమైన ప్రేమలో కొంచెం అన్వత దోషం, కొంచెం అపవిత్రదోషం, అనుమాన దోషం తగిలినా అంతా విషంగా పరిణమిస్తుంది. వీల్లేదు. చావుతోనే పరిహారం చెయ్యాలి. ఈ అక్రమాన్ని, విధి మిమ్మల్నీ నన్నూ, మన ప్రేమనీ మింగి నాశనం చేసి ... ఇద్దర్నీ ఆరు సంవత్సరాలు, సుందరమైన సంవత్సరాలు, కలిపి మధుర బంధనాలతో కట్టి, యేకం చేసి, క్రూరంగా నవ్వుతో, హృదయం లేకుండా ఒక్క నిమిషంలో చీల్చి, విడతీసి, చెరో మూలా ఈ అనంత ప్రపంచ వైశాల్యంలో యెక్కడో – యింక ఒకరికి ఒకరం అందకండా – యెంత యేడ్చినా, యెంత చేతులు జాచి వెతికినా లాభం లేకండా – పారేస్తోంది! ... రేపెక్కడ కళ్ళు తెరుస్తానో ! ... ఒకవేళ నా ఆత్మ మీ దగ్గరికి రాగలిగితే, వొచ్చినట్లు మీకు తెలియజేయగలిగితే, ఈ వుత్తరం చదివేప్పుడు మీ దగ్గర వుండగలిగితే ... మీ విచారం చూడగలనా? నేను దగ్గిరే వున్నానని తెలపగలనా? ...

నా ప్రేమని మీరు సందేహించవొద్దు. మీ దగ్గరికి వొచ్చి, ఒక్క సారి, ఒక్క నిముషం, నా ప్రేమతో, కన్నీళ్ళతో, ప్రమాణాలతో నా హృదయమంతా మీదేనని నా దేహం మలినమైనా, నా ప్రేమ నిర్మలమని తెలియచేయాలని యెంతో వుంది. ఒక్కసారి మళ్ళీ మీ నవ్వే మొహాన్ని చూడాలని, నా వేపు కొంటెగా మోహంతో చూసే మీ చూపు ననుభవించాలని, ప్రేమతో ఒక్కసారి పిలిపించుకోవాలని వుంది. యెట్లా? నిజమండి. ఒక్క నిమిషం కలలోనన్నా, మనసులో నన్నా ఇంకెవరినీ కోరలేదు. యెప్పుడూ – మొదట నన్ను మీరు చూడ్డానికి వొచ్చిన నాటినించీ కూడా నా ఆలోచనలు కోర్కెలు అన్నీ మీమీదనే. మీరు నమ్మరూ? చచ్చిపోతున్నాగా! ... యిప్పుడు నిజం చెప్పడానికింకేం? అవాళ సుబ్బారావు విషయమై మీరు అనుమానపడ్డారు కదూ? నిర్మలమైన మీ కళ్ళలో ఆ స్వల్పమాలిన్యమే చెప్పింది నాకు. కాని మీరు వొప్పకోలేదు. నిజమండీ. ఆ సుబ్బారావు నాకేం లెఖ్క! అందమైనవాడని తెలుసు. అందమైన వాణ్ణని అతనికి తెలిసి స్త్రీలందరూ తనని వొలిచి వోళ్లో పడతారన్నట్టు చూస్తాడు. నావంకా అట్లానే చూశాడు. మీరంతా ఆప్యాయంగా అతని పరిచయం నాకు చేస్తే అట్లాంటి భావంతో అతను చూస్తే నాకెంతో డోకొచ్చింది? మీరు నమ్మరు కాదు, అతను ఆ వెంకటచలం గారి కథ చదువుతుంటే, ఆ కథలో ప్రేమ, నా ప్రేమవలె వుంటే జ్ఞాపకం లేదూ – మెడ కింద చెయ్యేసి ముఖం పైకెత్తడం మనమల్లేనె! ఇంకా పోనీండి ఇప్పడెందుకు? – అందుకని శ్రద్ధతో కళ్ళతని మీదనే పెట్టుకుని వినివుంటాను. కాని ఆ సుబ్బారావు మీద మనసనుకున్నారు నాకు! ఇప్పడన్నా నమ్ముతారా? ... యెన్నో అనుకున్నాను. మీకు ప్రమోషన్ కాగానే, మనం ఆ చిన్న డాబా యిల్లు అద్దెకి తీసుకోవడం, వీధి వేపు గదిలో మన మంచమూ, అద్దమూ, పెట్టికోడమూ, రాత్రి మీరు క్లబ్బునించి వొచ్చేప్పటికి నేను ... ఎందుకులెండి అవన్నీ! నా కోసం అట్టే యాడవకండి.

ఆ రాత్రి మీరు రెండు నెల్ల కిందట నన్ను వొదిలి బైటికివెళ్లారు. ఆ రాత్రి జ్ఞాపకముందా? అంతకుముందు ప్రతివారమూ మీరు వొస్తారు వొస్తారని యెదురు చూసి చూసి నిరాశచెంది వున్నాను. చివరికి అనుకోకుండా ఆ రోజు మధ్యాహ్నం వచ్చి, ఆ రాత్రి మెయిలికి వెడతానన్నారు. మీ మొహం చూస్తో వుండే సంతోషమంతా, మిమ్మల్ని మళ్ళీ నెలరోజులు వదలాలనే దుఃఖంలో కలిసి మాయమైపోయింది.బాధతో లాక్కుపోయే గుండెల దడదడని అణచుకుని, మీకు పెదిమల మీద నవ్వునే కనపరిచాను.

అలిసి వొచ్చిన మీరు రాత్రి మంచం మీద పడుకోగానే నిద్రపోయినారు. ఎన్నిసార్లో తలుచుకుని తలుచుకుని ఉవ్విళ్లూరిన మీ సాన్నిధ్యాన్ని ప్రత్యక్షంగా కావిలించుకుని మహదానందంతో, మీ బుజం మీద తలపెట్టుకుని కళ్ళు మూసుకున్నాను. రాత్రంతా మీ ముఖాన్నీ, మీ పెద్ద కనుబొమ్మల్నీ, పల్చని చొక్కా కింద మీ గట్టి బుజాన్నీ సన్నని దీపపు వెలుగులో చూస్తో పడుకున్నాను. అలారం గడియారం నిమిషాల్ని వొక్కటొకటే చప్పుడు చేస్తోంది. దాన్ని విసిరి పగలకొడితే! ... కాని పాపం పొద్దున్నే మీ మొహంలో వుద్యోగం భయాన్ని చూడగలనా? ... మీ బుజం మీద నల్లి పాకింది. దాన్ని కూడా ప్రేమించా నా రాత్రి. అది కూడా మిమ్మల్ని ప్రేమించి వొచ్చినట్టే కనపడ్డది. అట్లానే ప్రేమ భారంతో కళ్ళు మూసుకుని మీ బుజం మీదే నిద్రపోయినాను. నిద్రపోతున్నా రెండుగంటలైనట్టూ, మీరు లేచి వెళ్ళిపోతున్నట్టూ నాకు కలవచ్చి చప్పన లేచాను. కానీ మీ చక్కని దేహం నా చేతులకింద పడుకునే వుంది. మెల్లిగా లేచి గడియారంలోకి చూస్తే వొంటిగంటయింది యింకా ఒక గంట. మిమ్మల్ని గట్టిగా ముద్దు పెట్టుకుంటే, మీ రొమ్ము మీద నా తలని అదుముకుంటే, మీకు మెళుకువ వొచ్చి, అప్పడే ప్రయాణానికి సిద్ధమౌతారని భయం – కదలకుండా మీ గుండ్రని గడ్డంకేసి కోల చెంపలకేసి సన్నని గోళ్ళలో కొనలు తేలే వేళ్ళ కేసి, చూస్తున్నాను. మళ్ళీ కునుకుపట్టడమూ,



కిటికీలోంచి తొంగిచూశాను. దీపం వెలుతురులో మీ కాలు చివర మాత్రం కనపడ్డది. అదే ఆఖరుసారి మిమ్మల్ని చూడడం మన జన్మానికి. మీ నించి విరహం భరించలేక, మీరు పడుకున్నచోటే, కొంచం సిగరెట్టు వాసన వేసే ఆ పక్క మీద, మీ వంక తిరిగి మీరున్నట్టుగా భావించుకుంటూ పడుకున్నాను. మీరున్నట్టే అయింది. మీ చేతులు నా చుట్టూ వున్నట్టే, మిమ్మల్ని అనుకున్నట్టే అనుకున్నాను ...

యెంత సేపయిందో. కలలో మీరు తిరిగి వచ్చి నన్ను ముద్దు పెట్టుకున్నట్లు అలారం కొడుతున్న చప్పడైనట్టే మెళుకువ రావడమూ మిమ్మల్ని చిన్న చిన్న తేలిక ముద్దులు పెట్టుకోవడమూ. గడియారం వంక చూడడముతో గడిచింది ఆ కాస్త కాలమూ. టంగ్ టంగ్ మన్నట్లు అనుకుని అనుకుని, భయపడి గుండెలు దడదడ కొట్టుకున్నాయి. ఆ బాధ భరించలేక మిమ్మల్ని లేపి పంపెయ్యాలనిపించింది.

నిద్ర కళ్ళతో నన్ను కడసారి చూసి వెళ్ళిపోయినారు. బండి వెడుతూవుంటే నేను కూడా మీతో వొస్తూ వుంటే యెంత బావుండేది అనుకుని ఆశపడ్డాను.

తోచింది. మెళుకువ వచ్చింది. కొంచెంగా నన్ను కావిలించుకుని యెదురుగా వున్నారనుకున్నాను. యింకా కలా, ఆనందంతో సుఖానుభయంలో, నా దేహం మూర్ఛపోతోంది. యెంతో శాంతి వొచ్చింది నా నరాలకి.

"మళ్ళీ వొచ్చారేం?"

మాట్టాడలేదు. ప్రేమతో నా చేతులు మెడచుట్టూ వేసి దగ్గరికి యింకా అదుముకున్నాను. చంపలమీద చేతులు వేశాను? మీసాలు లేవు. యెవరది? వొదిలించుకోబోయినాను. పెనుగులాడాలానుకున్నాను. కాని నా నరాలు నాకెదురు తిరిగాయి. నా శరీరమే నాకే తిరగబడి ద్రోహం చేసింది. మీరు మోహంతో నన్నుద్రేకింపచేసి, తృప్తిపరచక, వొదిలిన నిరాశవల్ల నా దేహం యెంత ప్రయత్నించినా కదలలేదు. స్వాధీనం తప్పింది. నా భర్త! నా ప్రేమ! అంటాను. అరుచుకుంటాను. మూడు నెల్ల నించి మిమ్మల్ని తలుచుకుంటో అణిచిపట్టిన మోహతీవ్రత, మీరా రాత్రి సంతృప్తి పరచని ఆవేదన, అంతా నన్ను ముంచేసి, దాసురాల్ని చేసి, నా నిశ్చయశక్తిని నోరు నొక్కి నన్నిట్లా చేసింది. ... వాడు, మీ పరమాప్తు... పోనీలెండి. వాడెవరైతేనేం? యెందుకు?

ఆ రోజు నించి జాగ్రత్తగా వున్నాను. తలుపుగడియ వేసుకుంటున్నాను. వెంటనే మీ దగ్గరికి వొచ్చి మీతో అంతా చెప్పేది.మీ కాళ్ళ మీద పడి యేడిస్తే, మీరు కరుణిస్తారేమోనని ఆశ పుట్టింది. మీ దగ్గరికి వస్తానని కూడా రాశాను. జ్ఞాపకముందీ? కాని వూరి నించి వూరికి తిరుగుతో మీరు వీల్లేదన్నారు. మీకీ సంగతి రాయాలా కూడదా అని సందేహం పట్టుకుంది. చెపితే నన్ను వొదిలేస్తారా? అప్పుడు నేనెట్లా బతకను? అనుకున్నాను. అందుకనే మీకు రాశాను కూడాను. జ్ఞాపకముందీ? "ఒకావిడ యింకోడితో సంబంధం పెట్టుకుని తరవాత పశ్చాత్తాపపడ్డది. భర్త వొదిలెయ్యాలా; కూడదా? యేది ధర్మం? మీ అభిప్రాయమేమిటి?" అని. మీ జవాబు చదివితే మీరు క్షమార్పణ చూపేటట్టు కనపడలేదు. మీరు విపరీతమైన బాధపడతారని తెలుసు. తెలిస్తే! మీరు నన్ను వొంటిమీద ముద్దు పెట్టుకుంటో "యిదంతా నాదే కదూ! ఇంకోరు తాకితే భరించలేను!" అన్నప్పటి ఈర్ష్యతో నిండిన మీ చూపులు జ్ఞాపకమొచ్చాయి. ఆలోచించి, ఆలోచించి మీతో చెప్పకూడదనుకున్నాను. "యెందుకు చెప్పడం? యేం లాభం చెప్పి? ఇంక మూణ్ణెల్లల్లో యిద్దరం ఎప్పుడూ కలిసే వుంటాం. మీకు ప్రమోషన్ కాగానే! యింక వాడేమి చేస్తాడు? అనుకున్నాను. కాని నా అదృష్టం యిట్టా పరిణమించింది. నా ఆశలన్నీ, సంతోషమంతా యిట్లా బుగ్గిలో కలిశాయి. నెల రోజుల కిందటే మొదటి అనుమానం కలిగింది. నిజమేనేమో అని భయంతో, గిజగిజలాడాను. యేదో ఒకటి తేలిందాకా రోజురోజు యెట్లా గడిపానని! ప్రతిరోజూ యెదురు చూస్తో, తప్పు లెఖ్ఖ పెట్టానేమో నని కొన్నాళ్ళూ, ఆలస్యానికి కారణం కల్పించుకుంటో కొన్నాళ్లూ, ఆశలేని ఆశతో గడిపాను. కాని మెల్లిగా స్థిరపడ్డది. ఇంక మీతో బొంకేదెట్లా? యెన్నడూ లేనిది ఇప్పడే ఇది రావాలీ! పోనీ యెట్లానన్నా మిమ్మన్ని మోసపుచ్చి మీతో వుండే విధమే వుండకూడదూ?

మా వాళ్ళకు తెలిసింది. మీకు సంతోషంగా వుత్తరం రాశారు. ఈ రోజు ఆ వుత్తరం తరువాత ఇది అందితే మీ మనసు యెట్లా వుంటుంది? ఈపాటికే నన్ను సందేహిస్తో వుంటారు మీరు వుత్తరం అందేటప్పటికే! పోనీ బతికే వుందామా అనుకుంటా! చచ్చిపోతున్నాను గనక నేను రాశిన యీ సంగతులు నమ్ముతారేమో గాని బతికి ఉండి మీతో చెప్పితే నమ్ముతారా? నేనేదో కావాలని చేసి, యీ పన్నాగం పన్నాననుకుంటారు. వీల్లేదు. నీళ్ళల్లో పడతా నీ రాత్రే. శెలవు మరి. ఇంక మళ్లీ మీ మొహం చూడను. వొచ్చే జన్మంలో మీరెవరో నేనెవరో! యీ చివర నిముషాలలో, మీతో గడిపిన అన్నట్టపు దినాలూ, అమూల్య కాలమూ అంతా జ్ఞాపకమొస్తోంది. ఆరోజు తెల్లారకట్ట ... వొద్దులెండి. యెందుకదంతా ఇప్పుడు? – మళ్ళీ పెళ్ళి చేసుకుంటారా? ...


# PANTEJ

Wishes you a Happy & Prosperous

**DIWALI**

**We Deal In:**

Supply of computers & Peripherals.
Dealers of Priya & Maha Cement.
Accounting consultancy.
Distributors of Niagara Listerns.

PANTEJ MARKETING PVT. LTD.

P

**PANTEJ MARKETING PVT. LTD.**
8-3-214/29, Srinivasa Colony (West)
Ameerpet, HYDERABAD - 500 038
Phone: 3746695/297081